క్లుప్తంగా

కల్లుగీత కార్మికుడికి చేయూత

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు వెంపులూరు పెంచలనర్సయ్యగౌడ్ ఇటీవల తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు కిందపడి చేయి విరగడంతో ఆదివారం ఆయనకు గౌడ్ సేవా సమితి ట్రస్ట్ వారు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఉప్పల రామకృష్ణగౌడ్, యువత గౌరవాధ్యక్షుడు తాళ్ల రాజాగౌడ్, ముత్యంగౌడ్, తిరుపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న ఘటనపై దిశ పోలీసులకు వివాహిత ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కోవూరులోని లక్ష్మీనగర్‌కు చెందిన లక్ష్మికి ఎన్నెస్సార్ కాలనీకి చెందిన పవన్ కల్యాణ్‌తో 2019లో వివాహమైంది. ఆ సమయంలో కట్న కానుకల కింద రెండు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదును ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. కొద్ది రోజులుగా అదనపు కట్నం కావాలని భర్త, అత్తింటివారు ఆమె వేధింపులకు గురిచేయసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై ఆనంద్ భాస్కర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీజీఈఏ నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(అర్బన్): హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నెల్లూరు నగర శాఖ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీజీఈఏ సిటీ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా సతీష్‌బాబు, నాగరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కనకాద్రి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శైలేంద్రకుమార్, కోశాధికారిగా నారాయణతో పాటు వివిధ శాఖలకు చెందిన ఏడుగుర్ని ఉపాధ్యక్షులుగా, మరో ఏడుగుర్ని సంయుక్త కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి సుధాకర్‌రెడ్డి వ్యవహరించారు. కార్యవర్గాన్ని ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, మల్లికార్జున, జిల్లా కోశాధికారి రామ్‌ప్రసాద్, తదితరులు అభినందించారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):ముత్తుకూరు రోడ్డులోని సిల్వర్ ఓక్స్ స్కూల్లో జిల్లా స్థాయి చెస్ పోటీలను జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ మాట్లాడారు. పోటీలకు 177 మంది క్రీడాకారులు హాజరుకాగా, వీరిలో 16 మంది అంతర్జాతీయ ఫిడే రేటింగ్ క్రీడాకారులు ఉన్నారని చెప్పారు. ఆర్ఎల్ చెస్ అకాడమీ నిర్వాహకులు రామ్‌లక్ష్మణ్, ఆర్బిటర్స్ వంశీకృష్ణ, వెంకటరమణ, ప్రదీప్, సుధాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు

నెల్లూరు(బారకాసు): వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహకాలను ఆర్టీసీ సమీపంలోని రోటరీ ఆడిటోరియంలో నెల్లూరు రోటరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 15న అందజేయనున్నామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శేఖర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. హైస్కూళ్లలో అత్యధిక మార్కులను సాధించిన వారు, రంగస్థల కళాకారులకు నగదు పురస్కారాలు, దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను అందజేయనున్నామని పేర్కొన్నారు. సాయం కావాల్సిన వారు 95428 30347 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. క్లబ్ సెక్రటరీ సమీవుల్లా, చైర్మన్ శేఖర్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



నెల్లూరు(అర్బన్): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో వీ లవ్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆర్డీఓ ప్రారంభించారు. ఏపీ హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, ఫౌండేషన్ రీజినల్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నెరవేరని లక్ష్యం



తుప్పుపట్టిన ఫిల్టర్ ట్యాంక్



నిరుపయోగంగా మారిన వాటర్‌ట్యాంకు



నీటిశుద్ధి తొట్లలో పెరిగిన కంపచెట్లు

- అధికారుల ఉదాసీన వైఖరితో మూలనపడిన రాజీవ్ సబ్‌మిషన్ ప్రాజెక్ట్
- ఫ్లోరైడ్ బాధిత ఆవాస ప్రాంతాలకు అందని సురక్షిత నీరు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా

వరికుంటపాడు: ఉదయగిరి మండలంలోని గండిపాళెం జలాశయం వద్ద కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రాజీవ్ టెక్నాలజీ సబ్‌మిషన్ ప్రాజెక్ట్ అధికారులు, కాంట్రాక్టర్ల ఉదాసీన వైఖరితో మూలనపడింది. 66 ఫ్లోరైడ్ బాధిత ఆవాసప్రాంతాలకు సురక్షిత నీరు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్ట్ నిరుపయోగంగా మారడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పథకం ముఖ్యఉద్దేశం

ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం, మర్రిపాడు మండలాల్లోని ఫ్లోరైడ్ బాధిత ఆవాస ప్రాంతాలకు సురక్షిత మంచినీటిని సరఫరా చేయడమే రాజీవ్ టెక్నాలజీ సబ్‌మిషన్ ప్రాజెక్ట్ ముఖ్యఉద్దేశం. 2002లో అప్పటి కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు చొరవతో ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. గండిపాళెం జలాశయంలోని నీటిని శుద్ధి చేసి పైపులైన్‌ల ద్వారా గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభం నుంచే పూర్తిస్థాయిలో నిర్దేశించిన గ్రామాలకు తాగునీరందించిన దాఖలాలు లేవు. ప్రాజెక్ట్ ప్రారంభంలో ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో 44 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేవారు. కాలక్రమేణా నిర్వహణ లోపంతో 11 గ్రామాలకే తాగునీరు సరఫరా పరిమితమైంది. అధికారులు, కాంట్రాక్టర్ల ఉదాసీన వైఖరితో గత రెండేళ్లుగా పథకం పూర్తిగా మూలనపడింది. లక్షలాది రూపాయల విలువైన యంత్ర సామగ్రి తుప్పుపట్టిపోతున్నాయి. నీటిని శుద్ధి చేసే సిమెంట్‌తొట్లలో కంపచెట్లు పెరిగిపోతున్నాయి. రాజీవ్ సబ్‌మిషన్ ప్రాజెక్ట్ నుంచి ఎలాంటి రసాయనాలు కలపని స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం గ్రామాల్లో మినరల్‌వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. మినరల్ వాటర్‌లో రుచి కోసం రసాయనాలు కలుపుతున్నారు. ఈ నీటిని నగదు చెల్లించి కొనుగోలు చేసి మరీ తాగి రోగాలు తెచ్చుకుంటున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సబ్‌మిషన్ ప్రాజెక్ట్‌ను ఉపయోగంలోకి తీసుకొచ్చి సురక్షిత నీరు అందించాలని వారు కోరుతున్నారు.

రాజీవ్ సబ్‌మిషన్ ప్రాజెక్ట్ వివరాలు	
అంచనా విలువ	రూ.755లక్షలు
సమగ్ర మంచినీటి పథకాలు	8
రక్షిత మంచినీటి పథకాలు	7
రక్షిత నీరు సరఫరా చేసే మండలాలు	5
ఫ్లోరైడ్ బాధిత ఆవాస ప్రాంతాలు	66
లబ్ధి పొందే జనాభా	44,403

పథకాన్ని ఉపయోగంలోకి తేవాలి



గండిపాళెం జలాశయం వద్ద నిర్మించిన మంచినీటి ప్రాజెక్ట్ మూలనపడడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం.మినరల్ వాటర్‌ను నగదు చెల్లించి కొనుగోలు చేసి తాగుతున్నాం. ఈ నీటిలో రుచికోసం రసాయనాలు కలుపుతుండడంతో అనారోగ్యం బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి పథకాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలి.

–కంచర్ల వెంకటేశ్వర్లు, ఎస్‌బీకాలనీ, వీకేపాడు మండలం

రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

రాజీవ్ సబ్‌మిషన్ ప్రాజెక్ట్ మరమ్మతులకు గురైన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి ఆదేశాల మేరకు పథకాన్ని ఉపయోగంలోకి తెచ్చేందుకు రూ.2 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపాం. నిధులు మంజూరవగానే పనులు ప్రారంభించి ఉపయోగంలోకి తీసుకొస్తాం.

–రవీంద్రనాథ్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉదయగిరి

కోడిపందేల స్థావరంపై దాడులు




ఆత్మకూరు: మండలంలోని బోయలచిరివెళ్ల శివార్లలో బొగ్గేరు వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై శివశంకర్‌రావు తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కోళ్లు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

వంటపాత్రల పంపిణీ



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని టిడ్కో గృహాల వద్ద పేద కుటుంబాలకు ఆదివారం వంట పాత్రలను పంపిణీ చేశారు. రిలీఫ్ గాస్పెల్ ట్రస్ట్ నిర్వాహకుడు స్టీఫెన్ ఆధ్వర్యంలో స్టీలు పాత్రలు, హాట్‌బాక్స్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఖాజారహ్మతుల్లా, పెంచలయ్య, మల్లికార్జున, ఎడ్వర్డ్, తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు ముస్తాబైన ఆలయం



హోమాలకు సిద్ధం చేసిన యాగశాల

ఉదయగిరి: గండిపాళెం జలాశయం వద్ద ఉన్న సిద్దేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతన గణపతి, వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, సరస్వతీదేవి, అన్నపూర్ణాదేవి, సాయిబాబా, సిద్దేశ్వరస్వామి, శివలింగం, నందీశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో మంగళవారం నుంచి 18వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 14న ఉదయం గంగానయనం, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, కలశస్థాపన, మూలమంత్ర అనుష్టానం, సాయంత్రం అంకురార్పణ పూజలు, ప్రధాన దేవతా ఆవాహనం, అగ్నిప్రతిష్ట, దీక్షాహోమం, తదితర పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. 15న ప్రాతఃకాల పూజ, నూతన విగ్రహాల గ్రామోత్సవం, యంత్రాలకు అభిషేకాలు, హోమాలు, సాయంత్రం విగ్రహస్పర్శనం, క్షీరాభిషేకం, ధాన్యాధి ,శయ్యాధి, పుష్పాదివాసాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 16న ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు ప్రతిష్ఠా హోమాలు, శాంతి పౌష్టికహోమాలు, గర్తపూజ, యంత్ర, విగ్రహ, ప్రాణ, గోపుర శిఖర కలశ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.17న విశేష పూజలు, 18న మహాశివరాత్రి సందర్భంగా వేకువజాము నుంచే విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీఎస్సార్ విగ్రహావిష్కరణకు శంకుస్థాపన



శంకుస్థాపనకు హాజరైన వివిధ రాజకీయ పార్టీల నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని బీఎస్సార్‌సెంటర్‌లోని హిల్‌రోడ్డు, మెయిన్ బజారు కూడలిలో ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే బీ సుందరరామిరెడ్డి విగ్రహావిష్కరణకు ఆదివారం శంకుస్థాపన చేశారు. బీఎస్సార్ కుమారుడు, జెడ్పీ మాజీ చైర్మన్ రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్లు కేవీ శ్రావణ్‌కుమార్, ఎస్‌కే సర్దార్, వైద్యులు సీహెచ్‌ఆదిశేషయ్య, మస్తానయ్య, శివశంకర్, కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ఐవీ రమణారెడ్డి, పులిమి శైలజ, షేక్ సందానీ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందానీ, బీజేపీ నాయకులు కుడుముల సుధాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పద్మావతమ్మ, కేతా విజయ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహానికి ఇన్వర్టర్ బహూకరణ



దాతను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరు బీసీ బాలికల వసతి గృహానికి కోవూరుకు చెందిన విశ్రాంత ఏఈ గుత్తి సుబ్బారావు ఆదివారం ఇన్వర్టర్ బహూకరించారు. ఈ సందర్భంగా దాతను వసతిగృహ సంక్షేమాధికారిణి మల్లేశ్వరి, విద్యార్థులు శాలువా, పూలమాలతో సత్కరించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను కాంక్షించి దాతలు సాయం చేసేందుకు ముందుకురావడం అభినందనీయమని సంక్షేమాధికారిణి కొనియాడారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల స్వరాభిషేకం



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఘంటసాల స్వరాభిషేకాన్ని గ్రీన్ ఫోర్స్ ట్రస్ట్, కృష్ణ కల్చరల్స్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంగీత, నృత్య పోటీలను జరిపి విజేతలకు బహుమతులను అందజేశారు. మురళీమోహన్‌రాజు, అడ్వొకేట్ రమాదేవి, మురళీకృష్ణ, రవి, నిర్వాహకుడు కృష్ణ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..





నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి వేర్వేరుగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వీరిని సత్కరించారు.

నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

సోమశిల: అనంతసాగరం మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అన్నదాత వెంకటరమణావు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల నియమావళి, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు.ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరు కావాలని కోరారు.

నేడు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్ల పంపిణీ

సోమశిల: అనంతసాగరం మండలంలోని మంచాలపల్లి, సోమశిల సచివాలయాల పరిధిలోని గృహసారథులకు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లను సోమవారం పంపిణీ చేయనున్నటేట్లు మండల సచివాలయాల కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సోమశిల, మధ్యాహ్నం 2 గంటలకు మంచాలపల్లిలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గృహసారథులు, గ్రామసచివాలయ కన్వీనర్లు హాజరుకావాలని కోరారు.

అచ్చమాంబకు పొంగళ్లు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాళ్ల ఆలయం వద్ద ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు తొలగించాలి

జలదంకి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున మండలంలోని రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లను ఆయా పార్టీల వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా తొలగించకపోతే ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

హజ్ యాత్రకు విమాన సౌకర్యం కల్పనపై హర్షం

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వం హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింల కోసం విజయవాడ నుంచి విమాన సర్వీసు కల్పించి యాత్రికుల ఇబ్బందులను తొలగించడంపై జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి యస్దాని, ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ముస్లింలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, తదితర ప్రాంతాల నుంచి హజ్ యాత్రకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఆయా రాష్ట్రాల వారు అక్కడి ముస్లింలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారన్నారు. హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింల ఇబ్బందులను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నుంచి విమాన సౌకర్యం కల్పించి ఎంతో మేలు చేశారని కృతజ్ఞతలు తెలిపారు. హజ్ కమిటీ చైర్మన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి హజ్ యాత్రికుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంపై ధన్యావాదాలు తెలియజేస్తున్నామన్నారు.

పది విద్యార్థుల అల్పాహారానికి చేయూత



ఎంఈఓ చేతుల మీదుగా హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న దాతలు

ఉదయగిరి: గడ్డంవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీఅవర్స్‌లో అల్పాహారాన్ని అందించేందుకు పలువురు దాతలు ముందుకొచ్చారు. మద్దినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మద్దినేని అశోక్‌బాబు రూ.15వేలు, అడవిపేరంటాలమ్మ సేవాట్రస్ట్ చైర్మన్ కల్లూరి తిరుపతయ్య రూ.5వేలు నగదు వితరణ చేశారు. ఆదివారం ఎంఈఓ మస్తాన్‌వలి చేతుల మీదుగా హెచ్‌ఎం ఎన్ శీనయ్యకు నగదు అందజేశారు. తొలుత ఎంఈఓ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గన్నేపల్లి సర్పంచ్ నెల్లూరి వెంకటస్వామి, మద్దినేని చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి శివకుమార్, స్థానికులు దారపనేని నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సర్దార్, కరీముల్లాహుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కేంద్రాల భద్రతపై పరిశీలన



ఏటీఎం కేంద్రాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

సంగం: మండల కేంద్రమైన సంగంలోని ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను సీఐ రవి నాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఏటీఎం సెంటర్లలోని సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా..లేదాని పరిశీలించారు. ఏటీఎంల భద్రతకు సంబంధించిన వివరాలను నిర్వాహకుల నుంచి సేకరించారు. ఏటీఎం సెంటర్ల వద్ద రాత్రి గస్తీ ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం



దెబ్బతిన్న విద్యుత్ స్తంభం పక్కన ఏర్పాటు చేసిన కొత్త స్తంభం

కొండాపురం: మండలంలోని రేణమాల ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభం కింద దెబ్బతిని ప్రమాదభరితంగా ఉంది. ఈ సమస్యను కాలనీ వాసులు పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఇటీవల నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఆ తరువాత పాత స్తంభాన్ని తొలగించి నూతన స్తంభానికి తీగలను ఏర్పాటు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

'అపస్' రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు



కరపత్రాలు పంచుతున్న అపస్ నాయకులు

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే రాజగోపాలాచార్యులు, ఎస్ చంద్రమౌళి పిలుపునిచ్చారు. ఆదివారం వారు పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. 1982లో ఏర్పాటైన అపస్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తోందని తెలిపారు. అపస్ రాష్ట్ర మహాసభలను మార్చి 5,6 తేదీల్లో నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగే రాష్ట్ర మహాసభలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నాయకులు హాజరవుతారని వివరించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

అపస్ మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కుట్టుబోయిన బ్రహ్మానందానికి మద్దతుగా అపస్ నాయకులు ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఉపాధ్యాయులను కలుసుకుని ఓట్లు వేయాలని అభ్యర్థించారు. సంఘ జిల్లా కార్యదర్శి మణికంఠాచార్యులు, ఆత్మకూరు మండల బాధ్యులు పీ అనిల్‌కుమార్, జీ పెంచలరెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, హరీష్ కుమార్‌రెడ్డి, కే వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నాగసముద్రం సచివాలయంలో చోరీకి యత్నం



పొలాల్లో పడేసిన కంప్యూటర్లు



విచారణ జరుపుతున్న ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి

- దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

కలిగిరి: మండలంలోని నాగసముద్రం గ్రామసచివాలయంలో ఆదివారం రాత్రి ఓ వ్యక్తి చోరీకి యత్నించాడు. సచివాలయం తలుపులు పగులగొట్టి కంప్యూటర్లను అపహరించుకెళ్లేందుకు పక్కనే ఉన్న పొలాల్లో పడేశాడు. పొలాల్లో ధాన్యం కుప్పల వద్ద నిద్రపోతున్న రైతులు మద్దూలూరి రమేష్, కోటేశ్వరరావు అలికిడి విని సచివాలయం వద్దకు చేరుకోవడంతో కంప్యూటర్లను వదిలేసి కారులో పరారయ్యాడు. గ్రామస్తులు బైక్‌లపై వెంబడించి సమీపంలోని గుడిపాడు అటవీ ప్రాంతం వద్ద కారుతో పాటు దొంగను పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కలిగిరి ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పట్టుబడిన దొంగ వింజమూరుకు చెందిన ఖాజారహ్మతుల్లాగా గుర్తించారు. కారును స్వాధీనం చేసుకున్నారు. మద్యం మత్తులో ఉన్న దొంగ పొంతన లేని సమాధానాలు చెబుతుండటంతో పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు.